తెప్పించుకోవడాన్ని ఇష్టపడుతున్నారని తేలింది.



- అకస్మాత్తుగా ఏదన్నా తినాలనిపిస్తుంది, లేదా ఇంటికి వచ్చిన స్నేహితుడికి బహుమతి ఇవ్వాలనిపిస్తుంది... ఒకప్పుడు ఇలాంటి వాంఛలన్నీ ఆదిలోనే అణిగిపోయేవి. క్విక్ కామర్స్ వీటిని నిజం చేస్తున్నది.
- రోజంతా ఉరుకుల పరుగుల మధ్య ఇప్పుడు సమయం బంగారం అయిపోయింది. ఒక్క పది నిమిషాలు దొరికితే కుటుంబ సభ్యులతోనో, సినిమా చూస్తూనో గడపాలి అనిపిస్తున్నది. వెచ్చాల కోసం సమయం వెచ్చించాల్సిన అవసరం లేకుండా పోయింది.
- చాలా క్విక్ కామర్స్ సేవలు తెల్లవారి నుంచి మొదలై అర్ధరాత్రి వరకూ సాగుతాయి. బయటికి వెళ్లినా దొరకని వస్తువులు కూడా ఇవి అందిస్తున్నాయి.
- శ్రామిక దోపిడీ గురించి ఎన్ని ఆరోపణలు ఉన్నా... కాస్తోకూస్తో ఉపాధిని అందిస్తున్నాయనే వాస్తవాన్ని ఒప్పుకోవాల్సిందే. నీతి ఆయోగ్ ప్రకారం ఇలాంటి రంగాల మీద ఆధారపడుతున్న శ్రామికుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. 2020-21లో ఆ సంఖ్య 77 లక్షలు ఉంటే, 2029-30 నాటికి రెండు కోట్లు దాటేయబోతున్నదని అంచనా!
- మనం ఏం ఆర్డర్ చేశాం, వాటిని ఎంత సేపటిలో తీసుకువస్తున్నారు, ఎంతవరకూ వచ్చాయి... ఇలా అనుక్షణం ట్రాకింగ్ చేసే సౌలభ్యం ఉంటుంది.

**సమస్యలకీ తొందరే!**

- క్విక్ కామర్స్ సేవల వల్ల కేవలం కిరాణా కొట్లు మాత్రమే కాదు... టోకు వ్యాపారస్తుల నుంచి సూపర్ మార్కెట్ల వరకూ అన్నిటికీ నష్టమే! వాటి వ్యాపారంలో గణనీయమైన నష్టాలు నమోదవుతున్నాయి. డీమార్ట్ లాంటి సంస్థలు కూడా నష్టాల బాట పట్టడం వెనుక ఈ సేవల ప్రభావమే కారణం.
- ఈ సంస్థలు నిలదొక్కుకోవాలంటే చాలా ఖర్చవుతుంది. పైగా పోటీ కూడా చాలా ఎక్కువగా ఉంది. ఆ నష్టాలను భరించేందుకు ఒక్కసారిగా కార్మికులను తొలగించడం, ప్రీమియం సేవల పేరుతో వినియోగదారుల మీద అదనపు భారం మోపడం, జీతభత్యాలలో కోత లాంటి పద్ధతులను పాటిస్తూ ఉంటాయి. ఒకోసారి అవి కూడా వికటించి దివాళా తీస్తాయి. Buyk, Jokr, Getir లాంటి ఎన్నో సంస్థల వైఫల్యాలే ఇందుకు ఉదాహరణ.
- ఓ అంచనా ప్రకారం వచ్చే మూడేళ్లలో మన దేశంలో క్విక్ కామర్స్ సేవలను వినియోగించుకునేవారి సంఖ్య అయిదు కోట్లను దాటేస్తుంది. వీళ్లందరికీ వస్తువులను అందించడం అంటే కొన్ని కోట్లసార్లు డెలివరీ చేయడమే. దాని వల్ల కాలుష్యం పెరుగుతుంది. రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువ కావచ్చు.
- గిగ్ వర్కర్స్ విషయానికి వస్తే... సమయం సందర్భం లేకుండా ప్రతీ నిమిషం సేవకు అందుబాటులో ఉండాలి. పండుగలకు సెలవులు కాదు కదా మరింతగా సేవ చేయాలి. ఇది యజమానులకు లాభసాటే కావచ్చు! కానీ, ఆ సంస్థలోని ప్రతి అంచెలో పనిచేసేవారికి మాత్రం కష్టమే!
- ఇప్పటికే నేటి తరంలో ఓపిక పట్టే గుణం తగ్గిపోతున్నదనీ, దాని వల్ల అసహనం పెరిగిపోతున్నదనీ మనస్తత్వ పరిశోధనలు నిరూపిస్తున్నాయి. పెరుగుతున్న నెట్ స్పీడ్ నుంచి క్విక్ కామర్స్ వరకూ ఈ మనస్తత్వాన్ని పెంచి పోషించేవే!
- ఓ వస్తువు కొనాలి అనుకున్న వెంటనే అది అందుబాటులో లేకపోతే క్రమంగా దాని పట్ల ఆసక్తి తగ్గుతుంది. ఖర్చు ఆగుతుంది. అలా కాకుండా కోరుకున్న వెంటనే కొనుక్కోగలిగితే... జేబుకు చిల్లు ఖాయం. ఆన్‌లైన్ షాపింగ్ మొదలైనప్పటి నుంచి ఇది అనుభవంలో ఉన్నదే! క్విక్ కామర్స్ వల్ల ఆ నష్టం మరింతగా పెరుగుతుంది.

**లాభమో, నష్టమో క్విక్ కామర్స్ సేవలు లేని జీవితాలను ఇక మీదట ఊహించలేం. కానీ, దాని పరిణామం మన జీవనశైలి మీద, సమాజం మీద ఎలా ఉంటుందన్నది మన చేతిలోనే ఉంది. అవసరానికి మాత్రమే వాటిని వాడుకోగలిగితే... మన జేబు మాత్రమే కాదు, మన మీద ఆధారపడిన చిన్న దుకాణాలను కూడా కాపాడుకోగలుగుతాం. అందులో మనం ఎంతవరకు విజయం సాధించగలం అన్నది కాలమే చెబుతుంది.**

## ఆసక్తికరమైన గణాంకాలు

1

క్రిసియం అనే సంస్థ నివేదిక ప్రకారం గత రెండేళ్లలోనే క్విక్ కామర్స్ అమ్మకాలలో 280 శాతం వృద్ధి కనిపించింది. 2029 నాటికి క్విక్ కామర్స్ వ్యాపారం ఏకంగా రూ.80 వేల కోట్లకు చేరుకుంటుందని ఈ నివేదిక అంచనా.

